క్లుప్తంగా

వరద బాధితులకు విరాళాల సేకరణ



వరద బాధితులకు విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం(మునగపాక): విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఎస్ఈజెడ్ ముఠా కార్మికుల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ విజయవాడతో పాటు ఏలూరు, బాపట్ల, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో వరద నష్టం తీవ్రంగా ఉందన్నారు. బాధితులకు అందరూ చేయూతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నానాజీ, సత్తిబాబు, అప్పలనాయుడు, సత్యనారాయణ, తాతబాబు, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

కొత్త మోటారు ఏర్పాటు



మోటారు వేయిస్తున్న సర్పంచ్ వరహాలబాబు

కోటవురట్ల: నీలిగుంట అంగన్‌వాడీ కేంద్రం వద్ద మోటారు పాడైపోవడంతో సర్పంచ్ వరహాలబాబు స్పందించారు. సోమవారం కాలిపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారును ఏర్పాటు చేశారు. తాగునీరు పునరుద్ధరణ కావడంతో అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

గెడ్డ గట్టుకు గండి



వాడపాలెంలో గండిపడిన గెడ్డ

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం తంతడి శివారు వాడపాలెంలోని గెడ్డ గట్టుకు సోమవారం గండిపడింది. చాలా ఏళ్లుగా వాడపాలెం గెడ్డ నీటితో నిండి ఉంది. వర్షాలు అధికంగా కురవడంతో గెడ్డ గట్టుకు గండిపడి నీరంతా సమీపంలోని సముద్రంలోకి వెళ్లిపోతుంది. దీంతో ముంపు సమస్య తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.


మునగపాకలో వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీలు చేస్తున్న యలమంచిలి సీఐ ధనుంజయరావు

మునగపాక: మునగపాక మెయిన్ రోడ్డులో సోమవారం సాయంత్రం యలమంచిలి సీఐ ధనుంజయరావు వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ సరికాదన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను తరలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ



మూలపేట నుంచి అనకాపల్లికి వెళ్లే రోడ్డులో తెగిపడిన విద్యుత్ వైరు

మునగపాక: మూలపేట నుంచి అనకాపల్లికి వెళ్లే మార్గంలో విద్యుత్ తీగ తెగిపడిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు అనకాపల్లికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభానికి ఉన్న వైరు తెగిపడి రహదారిపై పడిపోయింది. గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ లైన్‌మన్ రాముకు సమాచారం అందించారు. దీంతో ఆయన స్పందించి సరఫరా నిలిపివేసి, వైరును సరిచేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లేకుంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ముంచేసిన వరద



ఏటికొప్పాకలో నూకాలమ్మ గుడి వద్ద కూలిన భారీ వేప చెట్టు



మత్రిపాలెంలో ముంపునకు గురైన వరి పొలాలు



నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న నక్కపల్లి తహసీల్దార్ అంబేద్కర్



మంగవరం రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును దగ్గరుండి పక్కకు తరలిస్తున్న సీఐ అప్పన్న

- ముంపులో పల్లపు ప్రాంతాల్లోని వరి పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

నక్కపల్లి: గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పొలాలు నీటమునిగాయి. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక వర్షాలు ఆలస్యంగా పడడంతో ఆగస్టు నెలాఖరు వరకు చాలా గ్రామాల్లో వరినాట్లు పడలేదు. ఏదోలా నాట్లు పూర్తి చేశాం.. అని ఆశతో ఉన్న రైతులకు నాలుగు రోజుల నుంచి పడుతున్న వర్షాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. కొండల్లో పడిన వర్షాలు గెడ్డలు, వాగుల ద్వారా దిగువ ప్రాంతాలకు అధికంగా వచ్చి చేరడంతో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గోపాలపట్నం ఆవ పొలాల్లోకి వరదనీరు ఎక్కువగా వచ్చి చేరింది. దీంతో గొడిచర్ల, ఉద్దండపురం, నామవరం, గుంటపల్లి, చినరామభద్రపురం, దేవవరం, తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో వేసిన వరినాట్లు నీటమునిగాయి. మరోవైపు ఈ ప్రాంతాల్లో ఉన్న చెరువులు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. ఇక గుల్లిపాడు, రమణయ్యపేట, జగన్నాథపురం, డొంకాడ, సీతానగరం, చినదొడ్డిగల్లు, కొత్తూరు తదితర ప్రాంతాల్లో కూడా పోలవరం కాలువ సర్‌ప్లస్ నీరు పిల్ల కాలువల ద్వారా బయటకు వచ్చి సమీపంలో ఉన్న చెరువుల్లోకి, పొలాల్లోకి చేరుతోంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, వర్షాల కారణంగా వరి నాట్లు కుళ్లిపోవడం, తెగుళ్ల సోకడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం, ఆర్టీసీ కాంప్లెక్స్, నక్కపల్లి వీవర్స్ కాలనీ, ఉపమాక రోడ్డు, వెంకటనగర్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీ, రెల్లి కాలనీల్లోకి భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. జాతీయ రహదారి నుంచి గుల్లిపాడు, రమణయ్యపేట మీదుగా రేబాక వెళ్లే రోడ్డు జలమయమైంది. నీట మునిగిన పొలాలు, నష్టాన్ని అంచనా వేసేందుకు తహసీల్దార్ అంబేడ్కర్, వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఉద్దండపురం, గొడిచర్ల, వేంపాడు, కాగిత, దేవవరం, చినరామభద్రపురం తదితర గ్రామాలతో పాటు గోపాలపట్నం ఆవ పొలాలను పరిశీలించారు. ఇళ్లు, ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నా, చెరువులకు గండ్లు పడినా తమకు సమాచారం ఇవ్వాలని వీఆర్వోలను ఆదేశించారు. తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకార గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలను పరిశీలించి, పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆచంట సన్యాసిరాజు, రైతు నాయకులు వైబోయిన రమణ, పొడగట్ల రమణ, ఇందన రాములు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



చాకలి పేట వద్ద తాండవ నదిని పరిశీలిస్తున్న అధికారులు

ఉధృతంగా తాండవ నది

పాయకరావుపేట : వర్షాల కారణంగా తాండవ రిజర్వాయర్‌లో నీటిని విడుదల చేయడంతో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన చాకలి పేటను తహసీల్దార్ కె.జయప్రకాష్, సీఐ జి.ఎస్.అప్పన్న పరిశీలించారు. తాండవ నదిపై సత్యవరం వద్ద నిర్మించిన బ్రిడ్జిని కూడా పరిశీలించారు. అనంతరం పాయకరావుపేట నుంచి మంగవరం వెళ్లే రోడ్డులో అరట్లకోట గ్రామం వద్ద రోడ్డుపై అడ్డంగా పడిపోయిన తాటిచెట్టును పక్కకు తరలించే చర్యలు చేపట్టారు. ముఠా ఆనకట్ట, భూమి ఆనకట్టల వద్ద నీటి ప్రవాహ ఉధృతిని అధికారులు పరిశీలించారు. పంట పొలాలు కూడా వర్షపునీటిలోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ, నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మంత్రి పర్యటన

లోతట్టు ప్రాంతమైన చాకలిపేటను హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. తాండవ నది ఉధృతికి చాకలిపేట వాసులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇందిరా కాలనీ, అంబేడ్కర్ కాలనీలు వర్షాలకు ముంపునకు గురవుతున్నాయని మంత్రి అనితకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, పెదపాటి మేఘరంజన్ వినతిపత్రం అందజేశారు.

'వరహా' ఉగ్రరూపం



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

ఎస్.రాయవరం: మండలంలో వరహా నది ఉగ్రరూపం దాల్చడంతో ఎస్.రాయవరం–లింగరాజుపాలెం బ్రిడ్జిపై వరద నీరు ప్రవహించి సుమారు 3 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో వర్షం తగ్గినప్పటికి సోమవారం వరహా నది ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ వరద కారణంగా సుమారు 141 హెక్టార్లలో వరి పొలాలు నీట మునిగాయని వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. లింగరాజుపాలెం, ఎస్.రాయవరం, వాకపాడు, ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, సైతారుపేట, పేట సూధిపురం తదితర గ్రామాల్లో పొలాలు మునిగిపోయాయి.

నీటిలో 118 హెక్టార్ల వరి పొలాలు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలోని 11 గ్రామాల్లో 373 మంది రైతులకు చెందిన సుమారు 118 హెక్టార్లలో వరి పంట నీట మునిగిందని రాంబిల్లి వ్యవసాయాధికారి సుమంత తెలిపారు. కొత్తూరు శారదానది, నారాయణపురం వద్ద మైనర్ శారదా నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పరివాహక ప్రాంతమైన పంచదార్ల, కొత్తూరు, దిమిలి, రజాల, కొట్టుబోలు, మురకాడ, మత్రిపాలెం, వెల్చూరు, రాజకోడూరు, తదతర గ్రామాల్లో వరి పంట ముంపునకు గురైంది. ఆయా పొలాలను యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో ఏడీఏ బి.ప్రభాకర్, ఎంపీఈవో రామారావు, వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ముంపు పొలాల్లో జాగ్రత్తలు అవసరం



ఎస్.రాయవరం శివారులో నీట మునిగిన వరి పొలాలు

మునగపాక: ముంపునకు గురైన వరి పొలాల్లో రైతులు తగి జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక మండల వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్న కుమారి సూచించారు. మండలంలోని వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో ముంపునకు గురైన పొలాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంలో చేరిన వరద నీరు బయటకు పోయేలా చూడాలన్నారు. ఎరువుల వినియోగం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మళ్ల వరహా నరసింగరావు, మళ్ల శేషు, నాయుడు, ఏఈవో లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వర్షపునీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్న యలమంచిలి రాజీవ్ క్రీడామైదానం

ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

మునగపాక మండలం వాడ్రాపల్లిలో ముంపునకు గురైన వరి పొలాలను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. ముంపునకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ముంపునకు గురైన పొలాల వివరాలను వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారిని అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చెప్పారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కూటమి నాయకులు కర్రి సాయికృష్ణ, టెక్కలి పరశురామ్, దొడ్డి శ్రీనివాసరావు, మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



వాడ్రాపల్లిలో వరిపైరు పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్,ఎమ్మెల్యే విజయకుమార్

తెరిపిచ్చిన వాన.. ముంపులో పొలాలు

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు సోమవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. ఈ నెల 6, 7, 8 తేదీల్లో యలమంచిలి ప్రాంతంలో సుమారు 13 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. దీంతో యలమంచిలి మండలాన్ని ఆనుకుని ఉన్న వరహా, శారదా నదుల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో నూకాలమ్మ గుడి వద్ద ఉన్న భారీ వేప చెట్టు వర్షాల తీవ్రతకు కూలిపోయింది. సుమారు 100 ఏళ్లకు పైగా వయసున్న ఈ చెట్టు కూలిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలో సుమారు 132 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనాలో ప్రభుత్వానికి నివేదించారు. 285 మంది రైతులకు రూ.22.44 లక్షల వరకు పెట్టుబడి నష్టం వచ్చిందని అధికారులు చెబుతున్నారు. వర్షాల ప్రభావంతో మండలంలో అనేక అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయి. 16వ నంబరు జాతీయ రహదారితో పాటు, యలమంచిలి–అచ్యుతాపురం రోడ్డు గుంతలు పడింది. యలమంచిలి పట్టణంతో పాటు పల్లపు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు ఇంకా తొలగిపోలేదు. రాజీవ్ క్రీడామైదానంలో వర్షపు నీటితో చెరువులా మారింది.



వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో వరి పొలం పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి



ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తూరు శారదా నది

వణికిస్తున్న వంతెనలు, రహదారులు



ప్రమాద స్థితిలో ఉన్న జల్లూరు వంతెన



ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో కూలిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు అప్పలరాజు

కోటవురట్ల: భారీ వర్షాలు రహదారులను ఛిద్రం చేశాయి. వంతెనలను ప్రమాదస్థితిలోకి నెట్టేశాయి. పంట పొలాలను నిలువునా ముంచేశాయి. 24 గంటల పాటు కుండపోతగా కురిసిన వర్షానికి మండలంలోని పరిస్థితులు అస్తవ్యస్తమయ్యాయి. ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు నదిలోకి జారిపోయింది. అసలే ఇరుకుగా ఉన్న ఘాట్‌రోడ్డు ప్రస్తుతం మరింత సన్నబడిపోయింది. సగానికి వరాహ నదిలోకి జారిపోవడంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మట్టి నాని ఉండడంతో మరింత కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే రహదారిలో రామచంద్రపురం జంక్షన్‌లో మినీ వంతెన ఓ పక్కకు ఒరిగిపోయింది. దీంతో దీనిపై రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా పోలీసులు పహరా కాస్తున్నారు. జల్లూరు వంతెన కూడా శిథిలమై భారీ వరద నీటికి కూలిపోయేలా ఉంది. దాంతో ఈ వంతెనపై కూడా భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నర్సీపట్నం మండలం పెద బొడ్డేపల్లిలో కోటవురట్ల వెళ్లే రోడ్డుకు అడ్డుగా స్టాపర్స్‌ను ఏర్పాటు చేసి పోలీసులు పహరా కాస్తున్నారు. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లే రహదారిలో మూడు చోట్ల అవాంతరాలు ఏర్పడ్డాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డులో కూలిపోయిన రోడ్డును పరిశీలించి ప్రభుత్వ వెంటనే ఘాట్‌రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జల్లూరు వంతెనను పూర్తి చేయడంతో పాటు రామచంద్రపురం జంక్షన్‌లో కొత్త వంతెనను నిర్మించాలని కోరారు.

తెగుళ్లపై జాగ్రత్తలు అవసరం



ఒంపోలులో ముంపునకు గురైన పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక: మండలంలోని ఒంపోలు గ్రామంలో సోమవారం సాయంత్రం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను శాస్త్రవేత్త రాజ్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పైరు నాటిన వెంటనే ముంపునకు గురైతే వర్షాల అనంతరం నీటిని బయటకు పంపాలన్నారు. అనంతరం 20 కిలోల యూరియా అలాగే 20 కిలోల పొటాష్‌ను వేయాలన్నారు. తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు 2 గ్రాముల కార్బండిజమ్, మాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదిబాబు, పద్మావతి, విజేత, తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న స్కూల్ శానిటేషన్ వర్కర్లు

తుమ్మపాల : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్లకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలంటూ సీఐటీయూ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తమకు ఆరు నెలలుగా జీతాలు లేవని, అర్ధాకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నెలకు రూ.6 వేల వేతనం అని, అది కూడా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి. వరలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లను తొలగించకుండా ప్రతినెల 5న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఆర్వో బి.దయానిధి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

తీర ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీర ప్రాంతంలో ఆక్రమణలను సోమవారం అధికారులు తొలగించారు. తీర ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ కొంత మంది మత్స్యకారులు ఇటీవల డీపీవో శిరీషారాణికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు.

గోకివాడలో సంపద తయారీ కేంద్రం ప్రారంభం



సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడిచి పెడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, జిల్లా పంచాయతీరాజ్ అధికారి శిరీషారాణి

రాంబిల్లి(యలమంచిలి): సంపద తయారీ కేంద్రాల ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు లభిస్తున్నాయని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం గోకివాడలో సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడిచి పెట్టి ప్రారంభించారు. సంపద తయారీ కేంద్రాల ఉపయోగాలను అధికారులు రైతులకు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆర్.శిరీషారాణి, డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి, సర్పంచ్ నీరుకొండ శారదా పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఏదీ?

- తక్షణం రైతు భరోసా నిధులు విడుదల చేయాలి
- ప్రభుత్వానికి వైఎస్సార్ సీపీ నేతల డిమాండ్
- నీట మునిగిన వరి పంట పరిశీలన



గొడిచర్ల, ఉద్దండపురం వద్ద నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, తదితరులు

నక్కపల్లి: వరుస వాయు గుండాలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులను తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికీ రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం సిగ్గు చేటని ధ్వజమెత్తారు. పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, తదితరులు సోమవారం మండలంలో పలు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. ఉద్దండపురం, గొడిచర్ల, చినరామభద్రపురం, కాగిత, తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు పొలాలను పరిశీలించి జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. వరుసగా నాలుగు రోజుల పాటు కుండపోతగా కురిసిన వర్షాలకు నాట్లు నీట మునిగిపోయాయని రైతులు వివరించారు. అనంతరం వీసం రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రైతు భరోసా కింద ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలంతా నమ్మి ఓటేశారని, ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా గురించి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అయితే మేలోనే రైతు భరోసా సాయం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఐదేళ్ల పాటు ఈ పథకం నిరాటంకంగా కొనసాగించిన ఘనత జగనన్నదేనన్నారు. టీడీపీ ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు కూడా సరిగా సరఫరా చేయలేపోయిందన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యాన, కూరగాయలు, అపరాల పంటలకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. నాడు–నేడు పథకం కింద పలు పాఠశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని, తక్షణమే ఈ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఇందన రాము, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు

యలమంచిలి రూరల్: అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై యలమంచిలి పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని షేక్‌ల్లపాలెం గ్రామానికి చెందిన బండ శ్రీను పట్టణం నుంచి 9 మద్యం సీసాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



గవర్ల అనకాపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి సూచించారు. మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో డెంగ్యూతో విద్యార్థిని మృతి చెందడంతో ఈ శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు రోగాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అనారోగ్యంగా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.